ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
29 బుధవారం, ఏప్రిల్ 2026
3
www.prajaveekshanam.in

# పెట్రోల్, డీజిల్ అపోహలు నమ్మవద్దు

## - ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

### - జీలుగుమిల్లిలో పెట్రోల్ బంకును ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**జీలుగుమిల్లి:ఏప్రిల్ 28 (ప్రజా వీక్షణం)**

పెట్రోల్, డీజిల్ సరఫరాపై వస్తున్న కృత్రిమ కొరత వార్తలను మరియు అపోహలను ప్రజలు నమ్మవద్దని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండల కేంద్రంలోని పెట్రోల్ బంకును ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బంకు వద్ద పెరిగిన వాహనాల రద్దీని గమనించిన ఎమ్మెల్యే, వినియోగదారులతో మాట్లాడి వారిలో ఉన్న భయాందోళనలను తొలగించే ప్రయత్నం చేశారు.

**అత్యవసర సేవలకు ప్రాధాన్యత**

ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఎమ్మెల్యే స్వయంగా పెట్రోల్ పంపు ద్వారా వాహనాలకు ఇంధనం నింపి అవగాహన కల్పించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ.. అంబులెన్స్‌లు, వైద్య సేవలు, ప్రభుత్వ వాహనాలు మరియు ప్రజా రవాణా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఇంధనం అందేలా



చూడాలని ఆదేశించారు.

**పారదర్శకత కోసం సూచిక బోర్డులు**

బంకుల వద్ద నిల్వ ఉన్న స్టాక్ వివరాలను ప్రజలకు తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అంతేకాకుండా "కొందరు కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. వదంతులను నమ్మి అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దు. ప్రభుత్వం అన్ని విధాలా అప్రమత్తంగా ఉంది," అని



ఆయన స్పష్టం చేశారు.

**పాల్గొన్న ముఖ్య నేతలు**

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు మరియు కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అధికారులు:
ఎమ్మార్వో వెంకటేశ్వరరావు, ఎంపిడిఓ వెంకటలక్ష్మి, డిటి పెద్దిరాజు.

కూటమి నేతలు
: జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, టిడిపి అధ్యక్షులు సుంకవల్లి సాయి, బిజెపి అధ్యక్షులు గుడ్ల రాంబాబు, జనసేన పోలవరం అధ్యక్షులు గునపర్తి చిన్ని.

ఇతర నేతలు:
పూనెం ఆదిత్య, గూడెల్లి లక్ష్మీ నారాయణ, కోలా మధు, తోట బాలు, జంగా మురళి, అజయ్, రాయి సుబ్బారావు, వనమా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అలాగే పెట్రోల్ బంక్ డీలర్ మొడియం శ్రీనివాస్ ప్రస్తుత నిల్వల పరిస్థితిని ఎమ్మెల్యేకు వివరించారు.

# బియ్యం మరియు నిత్యావసర సరుకులు అందజేత

**బాపట్ల : ఏప్రిల్ 28 (ప్రజా వీక్షణం) :**



బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెం పంచాయతీ పరిధిలోని పద్మనాభుని పేట లో నివసిస్తున్న గాత్రం వెంకట సుబ్బారావు కాలికి ఇన్ఫెక్షన్ వచ్చి 2 నెలల నుండి ఏ పనికి వెళ్ళటానికి వీలు లేని కారణంగా ఇంట్లో ఖాళీగా ఉండడం వల్ల ఆర్థికంగా ఇబ్బందిగా ఉందని కృతి ఫౌండేషన్ ను సహాయం అడగగా కృతి ఫౌండేషన్ సభ్యులు షేక్ గోరె మస్తాన్ మరియు మలిపెద్ది వీరబాబు ల సహకారంతో వెంకట సుబ్బారావు కుటుంబానికి మంగళవారం బియ్యం మరియు నిత్యావసర సరుకులను ఫౌండేషన్ చైర్మన్ ఆకురాతి వెంకట అశ్విని అందజేశారు. అదేవిధంగా బాపట్ల జిల్లా చీరాల మండలం పేరాల హైస్కూల్ దగ్గర నివసిస్తున్న సింగిరేసు మాలతి కి ఆపరేషన్ జరిగి ఆ ఆపరేషన్ ఫెయిల్ అవడం వల్ల 6 నెలల నుంచి ఏ పనికి వెళ్ళటానికి అవట్లేదని దాని కారణంగా ఆర్థికంగా ఇబ్బందిగా ఉందని కృతి ఫౌండేషన్ ను సహాయం అడగగా వారి కుటుంబానికి ఫౌండేషన్ సభ్యులు గోరె మస్తాన్ మరియు మలిపెద్ది వీరబాబుల సహకారంతో బియ్యం మరియు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుపై కిరాతక దాడి అమానుషం దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

## - ఏలూరులో ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏ ఆధ్వర్యంలో నిరసన

**ఏలూరు: ఏప్రిల్ 28: (ప్రజా వీక్షణం)**

చిత్తూరు జిల్లా వి.కోట ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డిపై జరిగిన కిరాతక దాడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మరియు ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఏలూరు జిల్లా శాఖలు తీవ్రంగా ఖండించాయి. జర్నలిస్టులను వేటకొడవళ్లతో నరికి చంపే స్థాయికి శాంతిభద్రతలు దిగజారడంపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

**రాష్ట్రంలో అరాచక పాలన: సంఘాల నేతల ఆగ్రహం**

ఈ సందర్భంగా జర్నలిస్ట్ సంఘాల నేతలు మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టులకు రక్షణ కరువైందని, అటవిక పాలనను తలపించేలా దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. సమాజ హితం కోసం పనిచేసే విలేకరులు నిరంతరం ప్రాణభయంతో గడపాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని వారు వాపోయారు.

**ప్రధాన డిమాండ్లు:**

తక్షణ అరెస్టు : జగన్మోహన్ రెడ్డి హత్యకు/దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి.

రక్షణ చట్టం : జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను నివారించేందుకు ప్రభుత్వం వెంటనే ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలి.

కుటుంబానికి భరోసా : బాధిత జర్నలిస్ట్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి.

**ఖండించిన ప్రముఖులు**

ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్. శంకర్రావు, సీనియర్ నాయకుడు కె. బాలసౌరి, జిల్లా అధ్యక్షుడు ఎస్.డి. జబీర్, కార్యదర్శి వై.వి. హరీష్, ఏపీబీజేఏ




అధ్యక్షులు పి. నారాయణరావు, కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే సహించేది లేదని, భవిష్యత్తులో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# శ్రీరామవరంలో సందడి: నూతన వధూవరులను ఆశీర్వదించిన టీడీపీ నాయకులు

**టి. నర్సాపురం, ఏప్రిల్ 28 : (ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం, టి. నర్సాపురం మండలం శ్రీరామవరం గ్రామంలో వివాహ వేడుక సందడి నెలకొంది. గ్రామానికి చెందిన కాల్నీడి వారి కుటుంబ సభ్యుల వివాహ ఆహ్వానం మేరకు, టి. నర్సాపురంలోని ఎస్.ఎస్. కళ్యాణ మండపంలో జరిగిన వివాహ వేడుకకు తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకులు మరియు కూటమి నేతలు హాజరయ్యారు. ముఖ్య అతిథుల రాక ఈ శుభకార్యానికి తెలుగుదేశం పార్టీ నాయకులు శీలం వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. వారు నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. వివాహ వేడుకలో పాల్గొన్న కూటమి నాయకులు వధూవరుల కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు శీలం వెంకటేశ్వరరావుతో పాటు కాల్నీడి రాంబాబు,సాధనాల భూషి బాబు,కాల్నీడి వాసు మరియు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వివాహ వేడుకతో కళ్యాణ మండపం కిక్కిరిసిపోయింది. బంధుమిత్రుల కోలాహలం నడుమ వేడుక ఘనంగా జరిగింది.



# కేంద్ర గ్రంథాలయంలో భరోసా కేంద్రం అవగాహన సదస్సు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 28 (ప్రజా వీక్షణం న్యూస్)**

ప్రజాపాలన ప్రగతి ప్రణాలిక లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ భరోసా కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ లోని కేంద్ర గ్రంథాలయం, వర్కింగ్ ఉమెన్ హాస్టల్, ఐడియల్ బ్యూటీ అకాడమీ లో మహిళలకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా భరోసా సేవలు, పితృ స్వామ్యం, స్త్రీ ద్వేషం, లైంగిక దోపిడీ, బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు, సైబర్ స్టాకింగ్, సైబర్ మోసాలు, సైబర్ సెక్యూరిటీ సైట్లు యాప్ ల సహాయ వ్యవస్థ, బాలల హెల్ప్‌లైన్-1098, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ డయల్-1930 మొదలైన అంశాలపై భరోసా కేంద్రం ప్రతినిధులు ఈ కార్య క్రమానికి హాజరైన విద్యార్థులు, మహిళా ఉద్యోగులకు వివరించారు. భరోసా సిబ్బంది రేణుక, తేజశ్రీ, నీరజ, రజిత, అనూష, పవిత్ర, రజని పాల్గొన్నారు.




# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**హైదరాబాద్,ఏప్రిల్28 (ప్రజా వీక్షణం)**

డాలర్ కాస్త బలపడడం, గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం వంటి కారణాలతో మంగళవారం బంగారం ధర తగ్గుదల నమోదు చేసింది. భౌగోళిక, అంతర్జాతీయ రాజకీయ కారణాలతో కాస్త హెచ్చుతగ్గులకు లోనవుతోంది. మంగళవారం ఉదయం పది గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గుదల నమోదు చేసింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,000గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,250గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.650 మేర తగ్గింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,150గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,400గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి.

ప్రజావీక్షణం
దినపత్రిక

# ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్ వినియోగంపై అవగాహన పెంచాలి

## - డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ సుబ్బారావు

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 28 (ప్రజా వీక్షణం)

ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్ వినియోగంపై అవగాహనను పెంచాలని డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ (డిపిఈవో) బి.సుబ్బారావు సూచించారు. స్థానిక ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన క్రైమ్ కేసులపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ క్రైమ్ కేసులపై త్వరితగతిన విచారణ చేసి స్థానిక కోర్టులలో ఛార్జ్ షీట్ వేయాలని సూచించారు. మే 9న నిర్వహించే లోక్ అదాలత్ లో సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారానికి కృషిచేయాలని తెలిపారు. ప్రభుత్వం నాణ్యమైన మద్యం సరఫరా చేస్తుందని, మద్యం నాణ్యతను, వివరాలను వినియోగదారులే స్వయంగా ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా పరిశీలించుకోవచ్చనే విషయంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణం లో మద్యం షాప్ లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమం లో ఎక్సైజ్ సిఐ ఈ స్వరాజ్య లక్ష్మీ, ఎస్సైలు మురళి, దొరబాబు మరియు సిబ్బంది పాల్గొన్నారు.




# పెట్రోల్ డీజిల్ కొరత లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలి

## - వైయస్సార్సీపి నియోజకవర్గ ఇన్ఛార్జ్ వడ్డీ రఘురాం





తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 28 (ప్రజా వీక్షణం)

కూటమి ప్రభుత్వానికి ముందు చూపులేదని, పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరుతున్న వాహణదారులే అందుకు నిదర్శనమని వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వడ్డి రఘురామ్ నాయుడు విమర్శించారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని హెచ్.పి పెట్రోల్ బంకు వద్ద ఆయన ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ముందు చూపులేదన్నారు. రాష్ట్రంలోని ప్రజానీకం, వాహనదారులు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. వ్యవసాయం దండగన్న చంద్రబాబు రైతులు ఇబ్బందులు పడుతుంటే చోద్యం చూస్తున్నారని మండి పడ్డారు. రైతులు ఇబ్బందుల్లో ఉంటే వ్యవసాయ శాఖామంత్రి ఫారెన్ టూర్ కి వెళ్లారని ఎద్దేవాచేశారు. వ్యవసాయానికి అవసరమైన డీజిల్ అందుబాటులో ఉంచేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలన్నారు. పంట కోతకు వచ్చిన సమయంలో ట్రాక్టర్, వరి కోత యంత్రాలు, వ్యవసాయ పరికరాలకు డీజిల్ అత్యంత అవసరమని, భారతదేశంలో ఎక్కడా లేని డీజిల్ కొరత ఒక్క ఆంధ్ర రాష్ట్రంలో మాత్రమే ఎందుకు ఉందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి వెంటనే దిద్దుబాటుచర్యలు చేపట్టి వాహనదారులకు డీజిల్, పెట్రోల్ అందుబాటులోకి తీసుకురావాలని, లేకపోతే పెట్రోల్ బంకులు ముట్టడించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. తొలుత వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి పెట్రోల్ బంక్ వరకు ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ వచ్చారు. పెట్రోల్, డీజిల్ పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. పెట్రోల్ డీజిల్ కొరత లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైఎస్సార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర భవితను మార్చే 'గూగుల్ అడుగు: ఎంపీ పుట్టా మహేష్ కుమార్

## - ఒప్పందం కుదిరిన 6 నెలల్లోనే శంకుస్థాపన
## - ఇది 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు నిదర్శనంలి
## - గూగుల్ ఏఐ డేటా హబ్, ఇన్ఫోసిస్ విస్తరణతో ఐటీ రూపురేఖలు మార్పు
## - విశాఖ గ్లోబల్ కనెక్టివిటీ హబ్ కాబోతోంది: ఏలూరు ఎంపీ హర్షం

ఏలూరు, ఏప్రిల్ 28: (ప్రజా వీక్షణం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో విశాఖపట్నం గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఒక 'గేమ్ చేంజర్'గా మారబోతోందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం విశాఖలో 1 గిగావాట్ సామర్థ్యంతో నిర్మించబోయే గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. గత అక్టోబర్‌లో ఒప్పందం కుదిరిన కేవలం ఆరు నెలల్లోనే ప్రాజెక్టు పనులు ప్రారంభం కావడం శుభపరిణామమని ఎంపీ పేర్కొన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఐటీ మంత్రి లోకేష్‌లు అమలు చేస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానానికి నిదర్శనమని కొనియాడారు. గూగుల్ డేటా హబ్‌తో పాటు, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ సంస్థల విస్తరణతో రాష్ట్ర ఐటీ రంగం కొత్త పుంతలు తొక్కబోతోందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌ను ఏ విధంగా ఐటీ హబ్‌గా మార్చారో, ఇప్పుడు అదే రీతిలో ఏపీని ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని మహేష్ కుమార్ తెలిపారు. రాబోయే ఐదేళ్లలో గూగుల్ సంస్థ విశాఖలో సుమారు 1.35 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. అలాగే రాష్ట్ర యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. అంతేకాకుండా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' పాఠ్యాంశాలను చేరుస్తున్నట్లు వెల్లడించారు. "గూగుల్ సంస్థ భారత్‌లో పెట్టబోయే అతిపెద్ద పెట్టుబడి ఇదే. 12 దేశాలతో సబ్-సీ కేబుల్ అనుసంధానం ద్వారా విశాఖపట్నం త్వరలోనే గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా మారుతుంది." అంటూ పుట్టా మహేష్ కుమార్, ఏలూరు ఎంపీ తెలిపారు. మొన్న అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ టెస్ట్ బెడ్, నేడు విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ప్రారంభం కావడం రాష్ట్ర యువత భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్‌లకు లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల



తరపున కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, ఏపీ మీదుగా నాలుగు బుల్లెట్ రైల్ కారిడార్లు, జూన్ నుంచి విశాఖ రైల్వే జోన్ ప్రారంభంపై స్పందించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కూడా ఎంపీ ధన్యవాదాలు తెలియజేశారు.

# పుంతలో ముసలమ్మ జాతర నిమిత్తం రూ 4.50 లక్షలు అందజేసిన వడ్డీ రఘురాం

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 28 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం పట్టణంలోని సవిత్రుపేటలో కొలువైన పుంతలో ముసలమ్మ తల్లి జాతరను పురస్కరించుకుని మంగళవారం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణవాసులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా హాజరై అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వైయస్సార్సీపి నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు రూ 4.50 లక్షలు విరాళాన్ని జాతర కమిటీ నిర్వాహకులకు అందజేసి, అమ్మవారిపై తనకున్న భక్తిభావాన్ని ఘనంగా చాటుకున్నారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# తహసిల్దార్ ను సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు..

దేవరకద్ర : ఏప్రిల్ 28 (ప్రజా విక్షణం)

దేవరకద్ర తాసిల్దార్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అర్షద్ మహమ్మద్ ను మంగళవారం దేవరకద్ర బి ఆర్ ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలోబిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, బిఆర్ఎస్ యువ నాయకులు చల్మారెడ్డి, నాగారం మాజీ సింగిల్ విండో చైర్మన్ రవీందర్ రెడ్డి,బిఆర్ఎస్ యువ నాయకులు కొండల్, మధు, చంటి, పాల్గొన్నారు.



# ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీ

## - 14మంది మహిళల దుర్మరణం

జకార్తాన్యూఢిల్లీ,ఏప్రిల్28 (ప్రజా విక్షణం)

ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 14 మంది మృతిచెందగా, 84 మంది గాయపడ్డారు. దేశ రాజధాని జకార్తా శివారులో ఉన్న బెకాసి వద్ద ఈ ప్రమాదం జరిగింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని తొలగించే ప్రయత్నం జరుగుతుందని రైల్వే అధికారులు చెప్పారు. ఓ కమ్యూటర్ ట్రైన్‌తో పాటు లాంగ్ డిస్టాన్స్ రైలు సోమవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కు చేరుకున్నట్లు ఇండోనేషియా రైల్వే శాఖ అధికారులు తెలిపారు. గాలింపు పక్రియ ముగిసినట్లు రెస్క్యూ ఏజెన్సీ అధికారులు తెలిపారు. రైల్వే బోగీలు నుజ్జు నుజ్జు అయ్యాయని, వాటిల్లో చిక్కుకున్న వారిని తొలగించడం పెద్ద సమస్యగా మారిందన్నారు. రైలుకు చెందిన మహిళా బోగీ దెబ్బతిన్నదని, బాధితుల్లో అందరూ మహిళలే ఉన్నట్లు అధికారులు తెలిపారు. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు ఇనుపకడ్డీలను గ్రైండర్లతో కట్ చేశారు.

# పుట్లగట్లగూడెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం నలిగిన యువ్వనం

జంగారెడ్డిగూడెం: ఏప్రిల్ 28( ప్రజా వీక్షణం )



ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని పుట్లగట్లగూడెం సమీపంలో మంగళవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం ఒక నిరుపేద కుటుంబంలో తీరని చీకట్లు నింపింది. అతివేగంగా వచ్చిన పామాయిల్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో 17 ఏళ్ల యువకుడు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు.





**ఘటన వివరాలు:**

కామవరపుకోట మండలం ఆడమిల్లి గ్రామానికి చెందిన చల్ల మౌళి (17) మంగళవారం గురువాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జంగారెడ్డిగూడెం నుంచి తన గ్రామానికి వెళ్తున్న క్రమంలో, పుట్లగట్లగూడెం వద్ద ఎదురుగా వస్తున్న ఏపీ 39 టి 3649 నంబర్ గల పామాయిల్ లోడు లారీ మౌళి ప్రయాణిస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టింది.
లారీ వేగం ధాటికి బైక్ నుజ్జునుజ్జు అవ్వగా, తీవ్ర గాయాలపాలైన మౌళి ఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. ప్రమాదం జరిగిన తీరు చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

**నాయనమ్మకు మిగిలిన గుండెకోత:**

మౌళి చిన్నతనంలోనే తండ్రిని కోల్పోగా, అతని నాయనమ్మ భగవతి కంటికి రెప్పలా పెంచి పెద్ద చేసింది. కూలి పనులు చేసుకుంటూ తన నాయనమ్మను పోషించుకుంటున్న మౌళి మరణంతో ఆ వృద్ధురాలు అనాథగా మారింది. “నాకు దిక్కెవరు?“ అంటూ ఆమె వేస్తున్న ఆర్తనాదాలు స్థానికులను కన్నీరు పెట్టించాయి.

**పోలీసుల దర్యాప్తు:**

సమాచారం అందుకున్న వెంటనే లక్కవరం ఎస్సై ఎస్.కే. జబీర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**స్థానికుల ఆగ్రహం:**

ఈ మార్గంలో పామాయిల్ లారీలు మితిమీరిన వేగంతో వెళ్తున్నాయని, అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక నిరుపేద యువకుడి ప్రాణం బలికావడంపై గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# డ్రగ్స్ నిర్మూలనకై 1000కి.మీ సైకిల్ యాత్ర చేసిన ఓరగంటి రంజిత్‌కు సన్మానం..

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 28 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన దండి మార్చ్ 2.0 డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ మిషన్ సైకిల్ యాత్రను అత్యంత విజయవంతంగా పూర్తి చేసి తన స్వగ్రామమైన గోలేటికి చేరుకున్న సందర్భంగా రెబ్బెన పోలీస్ స్టేషన్ లో సీఐ ఎం. సంజయ్, ఎస్సై వెంకట కృష్ణ ఇంత గొప్ప కార్యక్రమం చేసిన తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఓరగంటి రంజిత్ ని అభినందించి శాలువతో సన్మానించారు.తిరుపతి నుండి విశాఖపట్నం వరకు సుమారు 1000 కిలోమీటర్ల మేర సాగిన ఈ మహత్తర యాత్ర 17 రోజుల పాటు 13 జిల్లాల మీదుగా అలుపెరుగని దీక్షతో కొనసాగింది.ఈ ప్రయాణంలో ఓరగంటి రంజిత్ గారు 25కి పైగా యూనివర్సిటీలను, వివిధ కలశాలలను సందర్శించి, వేలాది మంది విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ,ఝఎ చీశ్ శీ ఐతీబస్త్రం ఝజవ ‾శీబ్ప్త్ర, ఝజవ ఖీబ్బతీవ అనే శక్తివంతమైన సందేశాన్ని ప్రతి గ్రామానికి చేరవేసి యువతలో గొప్ప చైతన్యాన్ని రగిలించారు.సీఐ ఎం. సంజయ్ గారు మాట్లాడుతూ సామాజిక శ్రేయస్సు కోసం రంజిత్ చేపట్టిన ఈ సాహసోపేతమైన యాత్ర అభినందనీయమని కొనియాడారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ఆయన చేస్తున్న కృషి యువతకు ఒక గొప్ప స్ఫూర్తి అని, సమాజంలో మార్పుకు ఇటువంటి ఉద్యమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకై యువత నడుం బిగించాలని అన్నారు.ఎస్సై వెంకట కృష్ణ మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులకు డ్రగ్స్ పైన అవగాహన కల్పిస్తూ 1000 కి.మీ సైకిల్ యాత్ర చేసిన రంజిత్ ని అభినందించారు.విద్యార్థులు, యువత డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుంపుల విమలేష్, పల్లె రాజేశ్వర్ రావు, యూత్ నాయకులు పుదరి సాయి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




# రైతు బాంధవుడు ‘శీలం సాయి వినయ్‘: మల్లుకుంట రైతులకు రూ .1.14 కోట్ల రుణాల పంపిణీ





మల్లుకుంట:ఏప్రిల్ 28 (ప్రజా వీక్షణం)

మల్లుకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు శీలం సాయి వినయ్ రైతుల పక్షపాతిగా నిలుస్తూ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా, ఆయన చొరవతో మల్లుకుంట పరిధిలోని 9 మంది రైతులకు రూ. 1,14,34,000/- (ఒక కోటి పద్నాలుగు లక్షల ముప్పై నాలుగు వేల రూపాయలు) భారీ రుణాలను మంజూరు చేయడం జరిగింది.

**సాయి వినయ్ చేతుల మీదుగా రుణ పత్రాల అందజేత**

రైతునేస్తం మరియు దీర్ఘకాలిక రుణాలకు సంబంధించి ఎంపికైన లబ్ధిదారులకు సంఘ అధ్యక్షులు శీలం సాయి వినయ్ స్వయంగా మంజూరు పత్రాలను అందజేశారు. ఈ భారీ ఆర్థిక సాయం రైతుల పెట్టుబడి అవసరాలకు మరియు వ్యవసాయ అనుబంధ పనులకు ఎంతో ఊతాన్ని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.

**ఈ సందర్బంగా శీలం సాయి వినయ్ మాట్లాడుతూ:**

రైతుల ఆర్థిక అవసరాలకు అండగా నిలవడమే సహకార సంఘం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అంతేకాకుండా మల్లుకుంట ప్రాంత రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు, వ్యవసాయ రంగాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.అలాగే భవిష్యత్తులో కూడా రైతులకు అవసరమైన అన్ని రకాల రాయితీలు, రుణాలు సకాలంలో అందేలా చూస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సి.ఇ.వో శ్రీ కె. వి. వి సత్యనారాయణ, సహకార సంఘ సిబ్బంది మరియు లబ్ధిదారులైన రైతులు పాల్గొన్నారు. తమకు ఇంతటి భారీ మొత్తంలో రుణాలను మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించిన అధ్యక్షులు శీలం సాయి వినయ్ కి రైతులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక పోటీలు..

దేవరకద్ర : ఏప్రిల్ 28 (ప్రజా విక్షణం)

హైదరాబాదులోని రవీంద్రభా భారతీలో మంగళవారం జరిగిన అంతా రామమయం దశాబ్ది ఉత్సవ సందర్భంగా కల్బుర్గి చెందిన శ్రీలక్ష్మి,అనుశ్రీ, చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక పోటీలు అక్కడున్న వారికి ఎంతో ఆకట్టుకున్నాయి.ఈ పోటీలోపాల్గొని చిన్నారులు సంస్కృతిక కార్యక్రమాలు చేయడం ఎంతో ఆనందంగా ఉన్నది అని తల్లిదండ్రులు అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి చేతుల మీదుగా చిన్నారులు మెమొంటోలు ప్రశంస పత్రం అనుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణాచారి పాడిన సంగీత పాట ఎంతో ఆకట్టుకున్నది. మంజుల బృందం తదితరులు పాల్గొన్నారు.










# పుంతలో ముసలమ్మ అమ్మవారిని దర్శించుకున్న వలవల బాబ్జి

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 28 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం పట్టణంలోని సవిత్రుపేటలో కొలువైన పుంతలో ముసలమ్మ అమ్మవారి 39వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సందర్భంగా వలవల మల్లికార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ పుంతలో ముసలమ్మ అమ్మవారి వార్షికోత్సవాన్ని ప్రతి ఏటా ఆలయ కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తుండటం అభినందనీయమని ప్రశంసించారు. అమ్మవారి చల్లని దీవెనలు, కరుణాకటాక్షంతో నియోజకవర్గ ప్రజానీకం ఆయురారోగ్య, అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు బాబ్జికి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలోదొడ్ల బాలాజీ, రాట్నాల సత్యనారాయణ, పంచకర్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



